
**మనిషి తనకు తాను యుగయుగాలుగా సంతరించుకున్న మహత్తర మానసిక భద్రతలలో నమ్మకం ఒకటి. ఆ మాటకి వస్తే మనిషికి తన నమ్మకం వంటిదేదీ లేదన్నా అతిశయోక్తి కాదు. అందుకేనేమో 'నమ్మకం వమ్ము చేయదు' అని నానుడి కూడా వచ్చింది. ఒక వ్యక్తి తనకు దీటుగా నిలబెట్టుకున్న అతని నమ్మకమే అతనినెంతగా క్రిందికి తోసిందో..?**

"జానకీ! ఈ గొలుసు చూశావా?"

"ఓహ్! చాలా బాగుంది. మీరు నా మనసు పసిగట్టి చేయించినట్టుంది. ఎంతైంది?"



"అంతా-మొత్తం ఆరు కాసుల బంగారం. మజూరీతో కలిసి ఆరు వందలు"

"చక్కని పనితనం! చేసినవాడి చేతులు ముద్దు పెట్టుకోవాలనిపిస్తోంది."

జానకీ, కృష్ణమూర్తుల పెళ్ళయినాక ఆమెకు కానుక రావడం యిదే ప్రప్రథమం. అయినా ఆమెలో గూడుకట్టుకున్న సందేహం విడిపోలేదు.

"ఏమండీ! ఒక్కటడుగుతా-ఇది నిజంగా మీరు నామీద ప్రేమతోనే తెచ్చారా లేక ఏదేనా మెరమెచ్చుకోసం...."

"ఛ-అదేమిటలాగంటున్నావు. అసలు నీకా అనుమానం ఎందుకు?"

"మిమ్మల్ని అడుగుతున్నా. నిజం చెబుతారా?"

"ఓ-నిర్మొహమాటంగా అడగొచ్చు."

"మరి...మరి....అంతా అనుకుంటున్న ఆ మణి మాట" జానకి వణుకుతూనే అన్నది. కృష్ణమూర్తి మొహం మొదట్లో కొంత వివర్ణమైనా క్షణంలో సంబాళించుకుని "ఔను-జానకీ లోకం నిజం నమ్మదు నేనేం చెప్పినా ఒప్పుకోదు. నీవూ ఆ లోకంలో ఒక మనిషివే—కానీ నీదగ్గర దాపరికమెందుకూ! మణి ఇంటర్మీడియేట్ చదువుతున్నప్పుడే గ్రంథం ప్రారంభమయింది. మా యిద్దరికి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. ఆమె నన్ను నిర్మలమైన మనస్సుతో ప్రేమిస్తున్నానని వ్రాసేది. కానైతే మాకు కలియలేదు. ఆమె పరోక్షంలోనని కాదుగాని-ఒక్కటి చెప్పుకోవాలి. నేను వివాహం చేసుకోవడానికి కారణం మణే"

"అంతేనా జరిగుతా? మీరు ఆమెను ప్రేమించనేలేదా?" జానకి అడ్డు తగిలింది

"నేను... నేను మణిని ప్రేమించాను" తడబడింది కృష్ణమూర్తి గొంతు.

"కంగారుపడతారేం- మీరు ఆమెను ప్రేమించలేకపోయారు. ఒకటి మాత్రం జరిగి ఉంటుంది ఆమె అంటే మీకు ఆప్యాయతా, కోరికా పుట్టి ఉంటాయి-"

"లేదు జానకీ లేదు. ముమ్మాటికీ కాదు. నేను మణిని మరువలేను."

"మీరు పొరబడుతున్నారు. ఆమె మీ గుర్తులో వుండజాలదు."

"కాదు జానకీ- వెయ్యిమందిలోవున్నా, కటిక చీకటిలోనైనాసరే నేను మణిని గుర్తుపట్టగలను. ఆమెకు నా హృదయంలో ఉన్న స్థానం అట్టిది."

"కాదు మీరు చెప్పేదే నిజమైతే మీరు ఈ విధంగా మధనపడరు. లోకం నాలుక బుజానవేసుకొని మిమ్ముల నింతగా అల్లరి చేసేదే కాదు. మీ వుభయులకూ ఏనాడో పెళ్ళి జరిగివుండేది."

"అబ్బే- కాదు జానకీ" కృష్ణమూర్తి అప్యాయత్త చిత్తుడయివుండే అన్నాడు. మళ్ళీ ఆ యువ గంపతుల సంభాషణ నాజూకుగ వున్న రెండు పేటల చంద్రగహారం వైపు మళ్ళింది. చల్లగాలి వారిని మౌనంవైపు లాక్కుపోయింది.

క్రమంగా కృష్ణమూర్తి యెదుట జానకి మణిని గూర్చి ప్రస్తావిస్తూ వుండేది. కాని అతడు ముడిగానే ప్రత్యుత్తరం యిచ్చేవాడు. సుమారు నెలరోజులు దాటాక ఒకనాటి రాత్రి కృష్ణమూర్తే మణి విషయం తీసుకువచ్చాడు.

"జానకీ—ఓ సాయం చేయాలి"

"ఏమిటో?"

"నీ చంద్రహారం ఒకసారి యెరువు యివ్వాలి."

"ఎవరికీ మణికేనా!" కళ్ళలో అదొక లిలగా అనుమానం మెరిసి విద్యుద్దీప కాంతిలో కృష్ణమూర్తి కంటబడకుండానే మాయమయింది.

"ఔను. ఆమెకు పెళ్ళి కుదిరింది. నీ చంద్రహారం ఎరువు కావాలి."

"కబురంపింనా మణి?"

"ఔను మళ్ళీ త్వరలో పంపేస్తుంది ఒకసారివ్వు."


"ఏమంటి-అడుగుతున్నాననుకునేరు. ఈ గొలుసు తిరిగివస్తుందా?"

"సందేహం ఎందుకూ? తప్పక వచ్చేస్తుంది."




అన్ని ముఖ్య కేంద్రములలో డీలర్లు కలరు.

SAVITA




"మీరు ఏదో నా దగ్గర దాస్తున్నారు. నిజంగా వస్తుందా? ఎలాగ?"

"అదేం ప్రశ్న' ఎలాగ రావడమేంటి?"

"అంటే-అరిగిపోయీ, విరిగిపోయీ. తెగిపోయీ అని కాదండీ- అసలు శాస్త్రీ మనకు చేరుతుందా?"

"నీ పిచ్చి అనుమానం పోలేదు. నేనంత మోజుగాణ్ణనా నీ వూహ? తప్పకుండా త్వరలో వచ్చేస్తుంది. అనుకోకుండా వాళ్ళకొక మంచి సంబంధం కుదిరింది. వరుడు బి. ఇ. దామోదరలోయ కార్పొరేషన్‌లో నెలకు అయిదు వందల రూపాయల జీతగాడు. కేవలం ఆమె అందానికి ముగ్ధుడై కాసు కట్నమైనా పుచ్చుకోకుండా వుభయ ఖర్చులూ భరించుకొని చేసుకుంటున్నాడు. పాపం! వాళ్ళు లేనివాళ్ళూ- బొత్తిగా బోసి మెడతో పిల్లను పంపడమా అని దిగులు పడుతున్నారు." "ఔనౌను. అందం చూసి మోజుపడనిదెవరూ?" రుద్ధకంఠంతో అంటూనే జానకి చేతిని మెడలోకి పోనిచ్చింది. ఉత్సాహంతో తడిమి గొలుసు అందుకున్నాడు కృష్ణమూర్తి. ఇస్తాందన్న మాటేగాని జానకికి మనసేమీ బాగులేదు. కారణం ఆమె పదేపదే కృష్ణమూర్తి గుణాన్ని శంకించడమే. ఈ దఫా ఆమెకు ఏదో అశుభసూచకంగా కూడా తోచిందేమో - మరీ బాధపడింది. కృష్ణమూర్తి ఇదేమీ పట్టించుకోలేదు. కారణం ఏ మిష మీదనైనాసరే జానకి మెడలోని చంద్రహారం మణి బోసిమెడలోకి చేరి మెరసిపోవాలనే ఆత్రుత.

## 2

జానకి కాపరానికి వచ్చినవేళ మంచిదే. కృష్ణమూర్తికి ఏదో పెద్ద ఉద్యోగానికి ఢిల్లీ నుంచి పిలుపు వచ్చింది. జానకి కోరుకునేవి రెండే రెండు విషయాలు, ఒకటి— భర్తకు ఔనన్న పెద్ద హోదా రావడం — రెండవది- ఆయనకు మణి దూరంగా వుండటం. రెండూ జరిగాయి — పెళ్ళయి పది రోజులైనా దాటకండానే మణి విశాఖపట్నం నుంచి ఆమె భర్త బీహారు రాష్ట్రంలో అతడు పనిచేసే చోటుకి తీసుకు వెళ్ళిపోయాడు. కృష్ణమూర్తిని ఎన్నో విధాల ముస్తాబు చేసి, మిక్కిలి ఉత్సాహపరచి "పరీక్ష బాగా వ్రాసి ఇంటర్వ్యూలో ఫస్టుగా రావాలి" అని శతధా హెచ్చరించి ఢిల్లీ పంపింది జానకి.

కృష్ణ ఢిల్లీకి రావడం అదే మొదటిసారి. ఇంటర్వ్యూ తేదీకి నాలుగు రోజుల ముందుగానే వచ్చాడు. తనకు సుపరిచితులైన పెద్దలను కలుసుకొని ఢిల్లీలో చూడవలసిన స్థలాలను చూస్తూ ఇంటర్వ్యూకు వచ్చిన బహుకొద్ది మంది- అంటే ఆరుగురే గనుక తాను తప్పక గెలుపొందుతానని తీయని కలలు కంటూ హాయిగా గడిపాడు. అతడు అనుకున్నట్లే పరీక్ష తేలిగ్గా వుంది. ఇంటర్వ్యూ కూడా బాగా జరిగింది.

పరీక్ష అయ్యాక తోడి అభ్యర్థులతో సంతోష సూచకంగా తేనీరు సేవించి వద్దామని కృష్ణమూర్తి కేంటీనుకు వెళ్ళాడు. టీ త్రాగుతూ అతడు యెదుటి వరుసలో తనవైపే తదేకంగా చూస్తున్న వ్యక్తిని చూసి చకితుడయ్యాడు. అతడు తన చిన్ననాటి స్నేహితుడు సారథి. అయితే మూర్తీ, సారథీ కలుసుకొని పదేళ్ళు దాటింది.

"సారథీ. ఇదేం. ఇలా వచ్చావు?" అదరిపడుతూ ప్రశ్నించాడు.

"ఓహో. మూర్తీ ఎన్నాళ్ళకెన్నాళ్ళకు" మిలమిల మెరిసే కళ్ళతో అతిసంభ్రమాశ్చర్యాలను ప్రకటిస్తూ సారథి ఉన్నపట్టున హుటాహుటిని లేచి గాఢంగా కౌగలించుకొని ఆనంద బాష్పాలు రాల్చాడు. మిత్రులొకరి నొకరు కుశల ప్రశ్నలు వేసుకొన్నాక "నేనిప్పుడు దామోదరలోయలో హజారీబాగ్ జిల్లాలో కోనార్ డామ్ వద్ద పని చేస్తున్నా. ఏడాది నుంచి అసిసెంటు ఇంజనీరుగా వుంటున్నా." పరిచయం చేసుకున్నాడు సారథి. నిజమే బాల్యమిత్రుడు సారథినే- ఆనవాలుపట్టలేకపోయినందుకు కృష్ణమూర్తి లోలోన తనను తానే చిన్నబుచ్చుకుంటున్నాడు. సారథి మూర్తిని వదలదలుచుకోలేదు. సాటి అభ్యర్థులను అతడే క్షమించండని ప్రార్థించి తన టాక్సీలో తీసుకువెళ్ళిపోయాడు

కృష్ణమూర్తి తిరుగు ప్రయాణాన్ని పూర్తిగా మార్చేశాడు సారథి. తనతో బీహారుమీదుగా కలకత్తా వెళ్ళేటట్లు అతన్ని వప్పించాడు. సింద్రీ ఎరువుల కర్మాగారం, దివె, కోనార్, మైధాన్ ఆనకట్టలు, బొకారో థర్మల్ స్టేషను దర్శించుకొని చిత్తరంజన్ రైల్వే కర్మాగారం చూసి శాంతినికేతన్ వెళ్ళి కలకతా మీదుగా విశాఖపట్నం చేరుకోవాలని కార్యక్రమం సిద్ధపరిచాడు. మూర్తిని ఒక్క నయాపైసాయేనా ఖర్చుచేయనియ్యడంలేదు. అనుకోకుండా తటస్థించిన ఈ సంఘటనకు బాల్యమిత్రుని సమాగమనానికి అతడు ఎంతగానో ఆనందాన్నీ, ఆశ్చర్యాన్నీ పొందాడు.

సారథీ, కృష్ణమూర్తి ముందు తిన్నగా కోనార్ వెళ్ళారు. కృష్ణమూర్తికి రహదారి బంగళాలో విడిది ఏర్పాటు చేయించి సారథి ఆనకట్టకు యెగువన వున్న యింటికి వుత్తరం వ్రాసి పంపాడు. "శ్రీమతీజీ! ఇవాళ నీకూ, నాకూ ఎంతో సంతోషదాయకమైన పండుగ. బాల్యమిత్రుడు కృష్ణమూర్తి వైజాగ్ నుంచి ఢిల్లీకి వచ్చాడు. నేను అతన్ని అనుకోకుండా కలసి ఇటు రమ్మని బలవంతం చేశాను. మేం ఆనకట్ట అంతా చూసుకొని పన్నెండు గంటలకు యింటికి వస్తున్నాం. మాకు మంచి విందు భోజనం యేర్పాటు చేయాలి-" సారథి—

కృష్ణమూర్తికి సారథి కోనార్ డాం గురించి చెబుతున్నాడు. "ఇది బీహారులో హజారీబాగ్ జిల్లాలో దామోదర నదిపై కట్టిన ఆనకట్ట. మెక్సికోలోని టెన్నెసీ లోయలోని కట్టల నమూనాపై నిర్మించబడ్డది. కోట్లకొలది రూపాయలు వెచ్చించి కట్టారు దీన్ని. నెహ్రూగారన్నట్లు 'ఆధునిక భారతంలో యాత్రాస్థలాలు ఇవే' — క్రొత్త నీటితో ఉరకలు వేసుకుంటూ బీహారు రాష్ట్రాన్ని దుఃఖంలో ముంచివేసే

దామోదర నదిని; ఆమె పరవళ్ళను చూస్తూ శరీరం గగుర్పొడుస్తూంటె కృష్ణమూర్తి తనను తానే మరచిపోతున్నాడు. సరిగ్గా తొమ్మిది గంటలకు మొదలుపెట్టారు ఆనకట్ట బాహ్య పరిసరాలను చూడడం. వివరాలను సారథి బోధిస్తూ ఆయా కార్యాలయాధికారుల్ని మూర్తికి పరిచయం చేస్తూంటే వారికి తెలియకండా రెండు గంటల సమయం దాటిపోయింది.

"డాం లోపలికి వెడదాం పద" అని అంతర్ముఖ ద్వారం తెరపించాడు సారథి. లోనికిఅడుగు పెడుతూనే మూర్తి భయంతో వణకిపోయాడు తామిప్పుడు భూమికి ఎన్నో అడుగులు లోతుగా వున్నారు. నదీ గర్భంలో మనిషి బాటవేసుకున్నాడు. పద మూడు ఫర్లాంగుల మేరవున్న ఆ కందకాంతర్భాగం పొడుగాటి ఒక గది వలె వుంది. ట్యూబులైట్లకాంతి పట్టపగలు చేస్తోంది చీకటిని. అందలి చిత్రాతిచిత్రాల్ని ప్రత్యేకంగా చూపెడుతున్నాడు సారథి. వారికి తెలియకండా ఉపరితలంలోని దామోదర నదీ వేగాన్ని మించి కాలవాహిని పరుగుపెడుతోంది. పన్నెండు దాటింది. "ఇంక మిగిలిందొక చిత్రం మూర్తీ! నీవు చూడాలి. ఈ దళసరిపాటి అద్దంలోంచి బయటకు చూడు. అదిగో - అదే నదీ ఉపరితలం. స్పష్టంగా వరద చూడవచ్చు. ఎప్పుడూ ఈ అద్దం నీటి మట్టానికి ఒక అడుగు ఎత్తు వుంటూంటుంది. కావాలంటే తలుపులుతెరచినట్లు పైభాగం అద్దాలను యెత్తి చేతులతో దిగువన పారే నీళ్ళను తాకవచ్చు. మరమ్మత్తులు చేసేటప్పుడు తీస్తూంటారు ఈ గాజు తలుపులు," అంటూ అధికారులను ప్రత్యేకంగా కోరి సారథి ఆ అద్దాలు తెరిపించాడు. మానవుడు ప్రయత్నంవల్ల సాధించిన ఇట్టి ఘన విజయాల్ని కృష్ణమూర్తి చూస్తూ దిగ్భ్రమ చెంది ముగ్ధుడై పోతున్నాడు. సారథి యేదో పనివుండి అటుపక్కకు వెళ్ళాడు. దామోదర నది వరద దృశ్యం కృష్ణమూర్తిని యీ ప్రపంచం నుంచి. పరిసరాల నుంచి ఎక్కడికో మోసుకపోయింది.

# 3

అంతా నీరు. నలువైపులా భయంకరమైన జల ప్రవాహం. ఎందరు జీవులనో ఏడిపించి. ఎన్నెన్ని ప్రాణాలనోతన పొట్టన బెట్టుకొని దామోదర నది వికటాట్టహాసంతో వీర విహారం చేస్తోంది. దాని అహంకారానికి హద్దులులేవు-కాదు నెలలు నిండిన జవరాలు అడుగులలో అడుగు వేసుకొంటూ బరువుగా, మందంగా నడుస్తున్న అందం చిందుతోంది, ఒక వంక. ఇంక జీవితంలో కదలననుకొని శాశ్వతంగా తిష్ఠ వేసుకొని కూర్చున్న మూఢ నమ్మకాలు పునాదుల కంట తునాతునకలై తేలిపోతున్నట్లు ఎన్నో మహావృక్షాలు వ్రేళ్ళతోసహా కొట్టుకు పోతున్నాయి. ఎన్నెన్నో మానులు, పలకలుగా తీర్చబడ్డ టేకు దిమ్మలు-ఎంత బరువైనవి ఎంత చులకనగా ఆ వేగంలో పడిపోతున్నాయో! ఏ ఏ గ్రామాలలో యెవరెవరివాటిని అమాంతంగా ఆ తల్లి యెతుకవస్తోందో గదా! ఇళ్ళ పైకప్పులు, మంచాలు, వ్యవసాయ సామగ్రి యేటి బడి వెడుతున్నాయి. అల్లంత దూరాన ఉయ్యాలలో చంటి పాప పానుపుపై యేమీ యెరుగనట్లు పరివృతమై వున్న గంగమ్మను చూసి నవ్వుతూ కేరింతాలు కొడుతున్నాడు వాడు యెవ్వరివాడో భవిష్యతులో యెంతటి జాతకుడౌతాడో- విధివిలాసం ఎవరూ చూడలేరుగదా! ఇంకొక దృశ్యం. పలకగావున్న మానుపై వుందొక నాగుపాము. తనకేమీ పట్టనట్టే అది విశ్రవీగుతున్నదేమో! లేకుంటె ఆ కృష్ణసర్పం ఎత్తిన పడగ మిట్టమధ్యాహ్నపు ఎండలో అల మిలమిలమెరుస్తూ వుండగలదా? మానవుని అంతస్సులో విద్యవల్ల వెలివేయబడని. సంస్కారం చేత మలచబడని ఒక అవగుణం తరి వచ్చినపుడు ఎలా స్వేచ్ఛగా పడగవిప్పి అతన్ని నీచాతినీచావస్థకు పతనమొనర్చుతుందో తెలుసుకోవడానికి ఆ త్రాచు ఒక మచ్చుతునక.

కృష్ణమూర్తి నుదురు చెమటలు గ్రమ్మింది. క్షణం అతడు గిరుక్కున వెనక్కుమళ్ళిపోయేవాడే. దూరాన్నుంచి తనవైపే వస్తున్నట్లున్న ఒక మృత కళేబరం అతన్ని నిశ్చేష్టుని చేసింది. ఆగిపోయాడు మూర్తి - కాదు అదే అతన్ని నిలవేసింది. అది ఒక శవం. ఆలోచించే లోగా అది ఆతని యెదుట తేలియాడడం మొగలుబెట్టింది. కడిగిన ముత్యంలాగున్న ఆ స్త్రీదేహం - ఆమె మరణించి ఆట్టే కాలం అయివుండదని చెప్పక చెప్పింది. ఒక గంటలేదా రెండు గంటలై చనిపోయి వుంటుంది. ఆ పడుచు. వొంటినున్న బట్టలింకా తెల్లదనాన్ని పూర్తిగా జేగురుపరచు కోలేదు. నొసటి కుంకుమ చారికలుగా మారింది కాని పూర్తిగా కరిగిపోలేదు. కృష్ణమూర్తి కళ్ళు బైర్లుగమ్మాయి. వొడలు స్వాస్థతనుపూర్తిగా కోల్పోయింది. భయం అతన్ని ఆవహించింది. సృష్టి యెంతటి చిత్రాతిచిత్రమైనదీ! ఏకాంతంలో అదే అంద చందాలు చిందే పడుచు కట్టెదుట సాక్షాత్కరిస్తే ఆనంద పారవశ్యంలో మైమరచి ఆమెను గాఢంగా ఆలింగనం చేసుకోవాలని ఎగబడే యువకుడు. మరి ఇప్పుడో-ఆ ప్రేతాన్ని చూచి అమితంగా హడలిపోతున్నాడు, కాదు


మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేపనముతో
చికిత్సను పొందండి
- శస్త్రచికిత్స
అవసరములేదు!

డా॥ పి. వి. కె. రావ్, B. A.,
వైద్యవిద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్



వివాహము వాయిదా వేయనవసరంలేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్ర స్కలనములకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు.

రావూస్ క్లినిక్
టి. బి. రోడ్. తెనాలి, ఫోన్ : 700, 1010.

SUVARNA

ఉచితం ఉచితం ఉచితం
తెల్ల మచ్చలు
ఏ రకం తెల్లమచ్చలైనాసరే వాని రంగు మరియు ఎర్రమచ్చలరంగు మా ప్రఖ్యాత ఔషధం "డాగ్ వినాశక్" వాడిన యెడల మూడు దినములలో మారును. అటుపైన మామూలు చర్మంవలె నుండిపోవును. ప్రచారం కొరకు ఒక సీసా మందు ఉచితంగా పంపెదము. వెంటనే వ్రాయండి.
Address
Jeevan Kalyan (B.D-8)
(P. O) Katri sarai (Gaya)

ఈ జగత్తు మానవ ప్రకృతి ఇంకా విచిత్రమైనది. తుచ్ఛ స్వార్థం భయం కన్నా గడ్డది. ఇంతటిభీతావహుడయ్యాడు కృష్ణమూర్తి అడుగుకు పైగా యెత్తున వున్న అతని చేతిని-తదేకంగా ఆ స్త్రీ శవంవెపే చూస్తూ మధ్య మధ్య అటూ, ఇటూ యెవరు లేరు గదా అని భయంతో పరకాయిస్తూ- ఆమె మెడలోకి పోనిచ్చాడు. బలాన్ని ప్రయోగించాడు ఫట్‌మని ఆమె మెడలో వున్న బంగారు గొలుసు త్రెంపేశాడు. తెగిన గొలుసు తీసుకోవడం, జేబులో మడతగావున్న పెద్ద కాగితం విప్పి పొట్లం కట్టుకోవడం. వణుకుతో వున్న చేతితోనే దాన్ని పంట్లాం జేబులో దాచుకోవడం కొన్ని సెకనులలో జరిగిపోయింది. ఇది ఏమీ యెరగనట్టు-కాగాయీ అఘాయిత్యం తనకు ఆనందమే యిస్తున్నట్టు భ్రమించిందా అనిపిస్తూ ఆ మృతదేహం అతని యెదురుగా మూడుసార్లు ప్రదక్షిణం చేసినట్లు తిరిగి సుడిగుండంలో పడి అతనికి దూరమయింది. గతించి కూడా ఆ ప్రాణి ప్రాణప్రియునికి మేలు కూర్చిన లేత యిలాలివలె వెళ్ళిపోయింది.

కృష్ణమూర్తి ప్రకృతంలోకి రాలేదు చాల సేపటి వరకు. తాను చేసిన పని యెవరూ గుర్తుపట్టలేరని తెలుసు అయినా భయం పోలేదు. ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. సారధి తనని వీపుపై చరచే వరకు కృష్ణమూర్తికి తెలివి రాలేదు. త్రుటిలో అదాల తలుపులు మూసేశాడు సారధి. కొద్ది నిమిషాలకు యిద్దరు బాహ్య ప్రపంచంలోకి వచ్చేశారు. కాని కృష్ణమూర్తి మొదట్లో లోనికి వెళ్ళినవానికి వలె బయటకు రాలేదు. రాలేదు కూడా కృష్ణమూర్తి మారిపోయాడు. కొన్ని గంటలలో పూర్తిగా మారిపోయాడు. సారధి యింటికి రానన్నాడు. అతన్ని బ్రతిమాలి నేరుగా కోనార్ నుంచి ధనబాద్ వచ్చేశాడు సారధి కిదేమీ అంతు చిక్కలేదు. అయితే అతడు మాత్రం ఏమి చెయ్యగలడు? మిత్రుని మంకుతనాన్ని కాదనలేకపోయాడు. అతడు నిజంగా యెంతో కించపడిపోయాడు. బాధపడ్డాడు కృష్ణమూర్తికి మతిగానీ పోయిందా అని కూడా తోచింది అతనికి మనంగొప్పవాళ్ళంఅనుకునేవారు చేసే దొంగతనాలు కూడా గొప్పగానే వుంటాయి-వాటి పరిణామాలు సైతం అనూహ్యంగానే వుంటాయి. కృష్ణమూర్తి డెహ్రాడూన్ ఎక్స్‌ప్రెస్ యెక్కి యెకా యెకీని హౌరా వచ్చేసి, కలకత్తాలో ఆగకుండా మద్రాసు మెయిల్ మీద విశాఖపట్నం చేరుకున్నాడు.

## 4

ఆనాటి రాత్రి జానకి మహదానందంతో పాన్పుపై వాలింది. మూర్తి వాడిలోకి దూసుకుపోతూ. గదిలో లైట్లు ఆర్పివేయబడివున్నాయి చీకటినీ, నిశ్శబ్దాన్ని భేదిస్తూ "జానకీ! మనకు అనుకోకుండా ఒక అపూర్వమైన లాభం కలిగింది" అన్నాడు కృష్ణమూర్తి.

"చెప్పనా?" అడ్డుకొన్నది జానకి.

"ఊఁ"

"మీకు ఉద్యోగం ఇస్తామన్నారు. మీరు ఫస్టుగా ప్యాసైవుంటారు. ఔనా?"

"కాదు" జానకి ఆ రెండక్షరాలూ విని విసుపోయింది.

"ఐతే-నే చెప్పుకోలేను" ఆమె తన అశక్తతను ఒప్పుకొంది.

"ఇదిగో ఈ వస్తువు అనుకోకుండా మనకు దొరికింది."

జానకి కృష్ణమూర్తి అప్పుడే పొట్లం విప్పిన గొలుసు తునకలను చేతితో తడిమిందో లేదో- చిమ్మచీకటితో మాటరాక అదిరిపడి "ఏమండి-ఇది మన చంద్రహారం. ఎల వచ్చిందీ-తెగిపోయిందే?" జడి చినుకులవలె ప్రశ్నలు కురిపించింది ఆశ్చర్యంతోను తడయారిన గొంతుతోను-

"ఏఁవిటి జానకీ-నువ్వనేది? మణి చచ్చిపోయిందా? నా మణి మరణించిందా?" హఠాత్తుగా పాన్పుపై కుప్పకూలిపోయాడు కృష్ణమూర్తి. జానకికి కిదేమీ బోధపడలేదు. ఎలా జరిగిందిదీ? ఏమిటీ ఇంద్రజాలం? తనను తాను సంబాళించుకోలేకపోతూనే చిగదిలో ట్యూబులైటు వేసింది. గదిఅంతా పగలయింది కృష్ణమూర్తి ఇంకా తేరుకోలేదు-అరగంటపైగా దాటేవరకు ఆ ప్రాణి తెరపిన బడలేదు. తరువాత దుఃఖంతో జరిగినదంతా పూసగ్రుచ్చినట్లు భార్యతో చెప్పాడు. "అరే. మీరు ఆమెను ఎలా ఆనవాలు పట్టలేకపోయారు? పోనీ మనగొలుసునైనా పోల్చుకోలేకపోయారా నిజం సుమండీ- అందుకే అన్నాను ఆనాడు "మీరు ఆమెను పోల్చలే"దని.

మరునాడు కృష్ణమూర్తి మణి యింటికి వెడుతూనే శోక సముద్రంలోవున్న ఆమె తలిదండ్రులు కనుపించారు. మూర్తిని మరి మరీ దుఃఖం భయ. సంభ్రమాశ్చర్యాలలో ముంచివేసింది. సారధి మణి తండ్రికిచ్చిన తంతి- "మీ అమ్మాయి మణి ఆత్మహత్య చేసుకొంది"— వారిని ఊరడించి, మరి తనను ఎవరు ఓదార్చాలో తెలియక తికమకపడుతూ ఇల్లు చేరుకొన్న కృష్ణమూర్తికి పోస్టుమేన్ ఒక రిజిష్టరుకవరు యిచ్చి తిరుగు రశీదుపై సంతకం చేయించుకొని వెళ్ళిపోయాడు.

మూర్తి కవరుచించి లోపలనున్న ఉత్తరాల్ని చూసి నిశ్చేష్టుడై నేలకూలిపోయాడు. జానకి వాటిని ఒక్కటొక్కటే చదివింది.

మొదటిది మూర్తికి సారధి వ్రాసింది. "మూర్తీ-బాల్యస్నేహితుడు రాకరాక మా యింటికి వచ్చినందుకు ఆనందగా విందు చేయలేకపోయానే అని ఎంతగానో బాధపడ్డాను ఆనాడు. కారణం నాడు నేను ఇల్లు చేరుకునేసరికి నా భార్య మణి ఆత్మహత్య చేసుకోవడం. ఆమె ఆవేళ ఉదయం సరిగా 9-10 గంటల మధ్య దామోదర నదిలో పడి మరణించింది. ఆమె యీ అఘాయిత్యం చెయ్యడానికి గల కారణం మొదట్లో బోధపడలేదు నాకు. ఆమె బట్టల పెట్టె వెదికితే "దీన్ని ఎవ్వరూ విప్పకూడదు" అని వ్రాయబడి అతికించబడిన కవరులోవున్న యీ వుత్తరాలు చూసి నేనంతా అర్థం చేసుకొన్నాను. చెప్పవద్దూ-నాకు అపుడు నీవు మా యింటికి విందుకు రాకపోయినందుకు మొదటలో కలిగిన ఆవేదన చల్లారిపోయింది." ఆగింది జానకి. కారణం మరొక వుత్తరం ఆమెను బలీయంగా- సారధి లేఖకన్నకూడా శక్తివంతంగా ఆకర్షించడం.

"నేనింతకన్నా ఏమీ చేయలేను. జీవితంలో ఒక్కసారి ఒక్కరికే

## సంకేతం

కిటికీ వెలుపల నిర్మానుష్యపు బాట
వెలవెలా చూస్తోంది నావైపు
వుండీ వుడిగీ వీస్తూండే గాలికి
ఎండిన ఆకులు గలగలా ఎగురుతూ
ఎటకో ప్రయాణం శరణార్థులలా!

అంబరాన ఒకే ఒక్క పక్షి
బిక్కు బిక్కుమంటూ
చూస్తోంది శూన్య దృక్కులు
దిక్కులేని బక్కచిక్కిన వృద్ధునిలా!

నెరియలు పడ్డనేల
నీటియద్దడికి ప్రతిబింబం
నిర్మానుష్యపు బాట
అతృప్తనయనాలకి సంకేతం!!

—ఆర్టిమస్

నేను నా ప్రేమను అంకితం చేశాను. కాని వారు నన్ను స్వీకరించలేదు. నన్నొకరు పరిత్యజించిన దాన్ని-వేరొకరు విశుద్ధ మనస్కులై చేపట్టారు కాని నేను ఆయన్ను ప్రేమించలేదు- ప్రేమించలేను. ఆయన్ను మోసం అసలే చెయ్యలేను. ఏదో దౌర్బల్యానికి లొంగిపోయి తల్లిదండ్రుల మాట కాదనలేక ఆయన్ను పెళ్ళి చేసుకున్నాను. విధి నన్ను వదల్లేదు. ఘోరంగా వెంటాడుతూనే వుంది. మళ్ళీ ఇవాళ నా ప్రేమాధి దేవతను నా ఎదుటకు తీసుకువస్తోంది. నేను ఈ వేదననింక ఎంతమాత్రం భరించలేను. ఆత్మహత్య తప్ప నాకు వేరు శరణ్యం లేదు. మంచి-లేదా చెడు-ఏదైనా కావచ్చు-నేను అదే చేస్తున్నాను." —మణి

ఈ వుత్తరం కంటె జానకి చకితపరచే ఇంకొక దాన్ని చదువుతూంది. అది కృష్ణమూర్తి లోగడ మణికి వ్రాసింది.

"మణీ! నన్ను క్షమించు. నేను నీ బ్రతుకును నాశనం చేసిన నీచుణ్ణి—బలహీనుడ్ని. నిన్ను అర్థం చేసుకోలేకపోయాను. నిన్ను నిజంగా ప్రేమించలేకపోయాను. ఏమీ చేయలేకపోయిన అసమర్థుణ్ణి.

కాని మణీ! నీవు నాకు చేసిన మహోపకారానికి నీ రుణం ఎలా తీర్చుకోవాలో తెలియడంలేదు. సన్యాసిగా మారిపోతున్న నాకు సంసార సౌఖ్యమయ జీవితమందిరానికి తలుపులు తెరచి ముందుకు నెట్టావు-

నాకు తెలుసు. ఇవాళ నీ పెళ్ళి జరుగుతోంది. నేను రాలేను- రాకూడదు. కాని ఒకటి చేస్తావుగా మణీ- నేను పంపిన ఈ బంగారు గొలుసును నా కానుకగా. నీనా మైత్రికి ఆనవాలుగా స్వీకరించు. నీవు దీన్ని కాదని నాకు త్రిప్పిపంపివేసే నాకు యీ ప్రపంచంలో శూన్యం దక్క- ఇంకేమీ మిగలదు. ప్రేమ పురస్సరంగా, భక్తి చిహ్నంగా నేను దీన్ని నీకిస్తున్నట్లు గ్రహించెదవని నా ఆశ." —మూర్తి.

ఆ మూడు వుత్తరాలకు కుట్టబడి ఒక చెక్కు వుంది. ఆరువందల రూపాయలకు మూర్తిపేర పెట్టింది ఆ చెక్కు. మూర్తి మణికి ఆనవాలుగా, కానుకగా ఇచ్చిన బంగారు గొలుసు ఆమె నదిలో పడిపోయింది గనుక ఆ వసువుకి వ్యక్తిగా సొమ్ము తీసుకొనమంటూ సారధి తన లేఖలో చివరిమాటగా కృష్ణమూర్తికి వ్రాశాడు. కృష్ణమూర్తి మౌనంగా మ్రాన్పడిపోయాడు. అతనికి కర్తవ్యం ఏమిటో తెలియడంలేదు. కృష్ణమూర్తి కూడా ఒక మనిషే గనుక ఏం చేస్తాడంటారూ....


## నవంబరు 3 నుంచి క్లాసులు ప్రారంభం!

**1981 ఫిబ్రవరి 21, 22 తేదీలలో**

**6వ తరగతిలోనికి ప్రవేశ పరీక్షలు జరుగును.**

## సైనిక స్కూలు, కోరుకొండ (ఎ. పి.)

* బాలుర వయస్సు 1981 జూలై 1వ తేదీ నాటికి 10–12 సం॥ మధ్య నుండవలెను. డిఫెన్సులోని ఎక్సుసర్వీసు ఉద్యోగుల, సర్వీసు ఉద్యోగుల పిల్లలకు మరియు షెడ్యూలు కులములవారికి ప్రత్యేక రిజర్వేషన్లు కలవు.

* కోరుకొండ సైనిక స్కూలుతో సమానముగా ప్రారంభించి, చక్కటి హాస్టల్సు వసతితో పై పరీక్షలకు ఇంగ్లీషు మరియు తెలుగు మీడియంలో శిక్షణ నిచ్చుటలో పేరెన్నికగన్న దక్షిణ భారత దేశమునందలి ప్రప్రథమ విద్యాసంస్థ.

ఫోన్ : 22084



## శ్రీ విద్యా విహార్

"ఆదర్శ గురుకుల విద్యాసంస్థ"

లలితానంద నగర్, రింగ్ రోడ్,

గుంటూరు–522 006.

ప్రతి సంవత్సరం అత్యుత్తమ ఫలితాలకు, సైనిక స్కూలులో చదువు వందలాది మా విద్యార్థులే మీకు నిదర్శనం

ఇంగ్లీషు, తెలుగు మీడియంలలో నర్సరీ నుండి 7 వ తరగతి వరకు క్లాసులు కలవు.

SAVITA